సాక్షి
చిత్తూరు
సోమవారం। 22। జూలై। 2024



తిరుపతికి కండలేరు జలాలు
తిరుపతి ప్రజల దాహార్తి తీర్చేందుకు కండలేరు జలాలను విడుదల చేస్తున్నట్లు తెలుగుగంగ ఎస్ఈ తెలిపారు.
- 8లో



దీవించు తల్లీ.. గంగమ్మా..
బోయకొండ అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున రావడంతో ఆలయం కిటకిటలాడింది.
- 8లో



కుష్టు నియంత్రణే లక్ష్యంగా..
జిల్లా వ్యాప్తంగా అధికారులు కుష్టు వ్యాధి నియంత్రణే లక్ష్యంగా వైద్యసిబ్బందితో ఎల్సీడీసీ సర్వే చేయిస్తున్నారు.
- 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి శిక్షా సప్తాహ్



మాట్లాడుతున్న డీఈఓ దేవరాజు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని సర్కారు స్కూళ్లలో ఈ నెల 22వ తేదీ నుంచి 28వ తేదీ వరకు శిక్షా సప్తాహ్ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ దేవరాజు వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించేలా డీవైఈఓ, ఎంఈఓలకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జాతీయ విద్యావిధానం 4వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జాతీయ విద్యావిధానం ప్రవేశపెట్టిన తర్వాత పరివర్తనాత్మక సంస్కరణలు, విద్యాభివృద్ధి అంశాలను తెలియజేడం శిక్షా సప్తహ్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రభుత్వం జారీచేసిన షెడ్యూల్ మేరకు కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని డీఈఓ కోరారు.

పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్‌డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్మ్డ్ రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు.

3681 సర్వీసులు తనిఖీలు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో శనివారం రాత్రి ట్రాన్స్‌కో 8 డివిజన్ల పరిధిలోని విద్యుత్ సర్వీసులను సిబ్బంది తనిఖీ చేశారు. ఇందులో మొత్తం 3,681 సర్వీసులను తనిఖీ చేయగా తిరుపతి ఆపరేషన్ 103, తిరుపతి రూరల్ 59, పుత్తూరు 89, చిత్తూరు అర్బన్ 62, చిత్తూరు రూరల్ 50, మదనపల్లె 74, పీలేరు 61, పుంగనూరు పరిధిలో 88 కేసులు నమోదు చేశారు. ఇందులో విద్యుత్ అదనపు లోడ్ కేసులు 464 కేసులకు గాను క్రమబద్ధీకరణ రుసుం రూ.10.34 లక్షలు, చౌర్యం కేసులు 122కు గాను రూ.80 వేలు జరిమానాతో కలిపి మొత్తం 586 సర్వీసులపై కేసులు నమోదు చేసి రూ.11.14 లక్షలు చెల్లించాలని వినియోగదారులకు నోటీసులు ఇచ్చినట్లు ఎస్ఈ సురేంద్రనాయుడు వివరించారు.

రూ.1.80 కోట్ల విద్యుత్ బిల్లుల చెల్లింపు

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రాలను ఆదివారం కూడా వినియోగదారుల కోసం అందుబాటులో ఉంచారు. ఉమ్మడి జిల్లాలోని విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రాల్లో 25 వేల మంది వినియోగదారులు చెల్లించారు. తద్వారా రూ.1.80 కోట్లు వచ్చిందని ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు వివరించారు.

కూటమి విధ్వంసం



పుంగనూరులో టీడీపీ మూకల దాడి(ఫైల్)



పుంగనూరులో టీడీపీ గూండాలు కాల్చివేసిన మాజీ ఎంపీ రెడ్డెప్పకు చెందిన వాహనం(ఫైల్)

నెలన్నర రోజుల కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి, సంక్షేమం పక్కనపెట్టి దాడులు.. దౌర్జన్యాలు, విధ్వంసాలకే అధిక ప్రాధాన్యత ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యంగా హింసాకాండ సాగించారు. కోట్లాది రూపాయల ఆస్తులను ధ్వంసం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించుకున్న పేదల ఇళ్లను సైతం నిలువునా కూల్చివేశారు. జిల్లా వ్యాప్తంగా చాలామంది వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు కూటమి అరాచకాలను తట్టుకోలేక ఊళ్లొదిలి వెళ్లిపోయారు.

- ఒకటిన్నర నెల పాలనలో వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యంగా దాడులు.. దౌర్జన్యాలు
- కమ్మపల్లిలో టీడీపీ మూకల వికృత చేష్టలు
- ఆస్తులు, వాహనాలు, పంటల ధ్వంసం
- పుంగనూరులో ఎంపీ, ఎమ్మెల్యే పర్యటనకు అడ్డంకులు.. ఆపై దాడులు
- వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు చేసి.. తిరిగి వారిపైనే అక్రమ కేసులు
- కుప్పంలో అంతులేని అరాచకాలు
- ఫ్యాన్‌కు ఓటేశారని అనేక కుటుంబాలను ఊర్ల నుంచి వెళ్లగొట్టిన కూటమి నేతలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి/సాక్షినెట్ వర్క్ : ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా నలభై ఐదురోజుల వ్యవధిలో కూటమి శ్రేణులు అరాచకాలు సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. వీరి వికృత చేష్టలకు అనేక కుటుంబాలు ఊరొదిలి వెళ్లిపోయారు. బయటకు వస్తే ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంతో నివాసాలకే పరిమితమవుతున్నారు. ఆరుగాలం శ్రమించి చేతికొచ్చిన పంటలను సైతం నాశనం చేశారు. మరికొందరి రైతుల పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించకుండా అడ్డుకున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పాలు సరఫరా చేసే వారిని సైతం గ్రామాల్లోకి రానివ్వలేదు. నోరులేని మూగజీవాలకు పశుగ్రాసం కూడా వేయనివ్వకుండా అడ్డుకుని రాక్షసానందం పొందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగం దక్కించుకున్న వారిపై దౌర్జన్యం చేసి కార్యాలయాకు వెళ్లి విధుల్లో పాల్గొనకుండా అడ్డుకుంటున్నారు.

టీడీపీకి ఓటు వేయలేదని..



టీడీపీ నేతల దాడిలో ధ్వంసమైన పెనుమూరు మండల కన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి వాహనం



టీడీపీ నాయకులు దాడిలో దెబ్బతిన్న వైఎస్సార్‌సీపీ నేత ఇల్లు



పుల్లూరు దళితవాడలో టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన బైక్

కార్వేటినగరం: టీడీపీకి అనుకూలంగా ఓటు వేయలేదని దళిత గ్రామంపై అగ్ర కులస్తులు దాడికి దిగి విధ్వంసం సృష్టించారు. శ్రీరంగరాజపురం మండలం పుల్లూరు దళితవాడలో ఎన్నికలు జరిగిన మరుసటి రోజు టీడీపీకి ఓటు వేయలేదని ఆగ్రహంతో ఊగిపోయిన అగ్రవర్ణాల వారు రాత్రి సమయంలో మారణాయుధాలతో దళితుల ఇళ్లల్లోకి చొరబడి, విద్యుత్ సరఫరాను నిలిపివేసి పైశాచికంగా దాడులు చేశారు. ఇళ్లలోని విలువైన వస్తువులను ధ్వంసం చేశారు. అలాగే ఇంటి ఆవరణలో ఉన్న బైకులను సైతం పగలగొట్టారు. దళితులకు ఏసీలు అవసరమా అంటూ వాటిని పగులగొట్టి, ఓ ఇంటిలోని దుస్తుల దుకాణాన్ని కూడా ధ్వంసం చేశారు. ప్రశ్నించిన వారిపై దాడికి పాల్పడ్డారు. అనంతరం ఏడుగురు దళితులపైనే కేసు నమోదు చేయించి వేధిస్తున్నారు. అదేవిధంగా పెనుమూరులో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి ఇంటిపై అర్ధరాత్రి దాడి చేసి ఆయన కారును ధ్వంసం చేసి, ఇంటి అద్దాలను పగులగొట్టారు. బయటకు వస్తే చంపుతామని బెదిరించారు. వెదురుకుప్పం మండలంలోని బొమ్మనదొడ్డి దళితవాడలోకి అగ్రవర్ణాలకు చెందిన టీడీపీ నాయకులు చొరబడి దళితులపై విచక్షణా రహితంగా దాడులు చేశారు.

పుంగనూరులో..



పుంగనూరులో టీడీపీ నేతల చేతిలో ధ్వంసమైన ఇండోర్ స్టేడియం

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో విజయం సాధించిన పుంగనూరు ఎమ్మెల్యే, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని సొంత నియోజకవర్గంలోనే పర్యటించకుండా పోలీసులు, టీడీపీ మూకలు అడ్డుకున్నారు. దళిత వర్గానికి చెందిన చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప నివాసంలో ఎంపీ మిథున్‌రెడ్డి పార్టీ శ్రేణులతో సమావేశం అయ్యారని తెలిసి టీడీపీ మూకలు ఇద్దరిపై రాళ్లు, కర్రలతో దాడులకు తెగబడ్డారు. సుమారు 10 వాహనాలను ధ్వంసం చేసి, మరో వాహనాలను దగ్ధం చేశారు. తిరిగి ఎంపీ, మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు 72 మందిపై హత్యాయత్నం చేశారంటూ అక్రమ కేసులు బనాయించారు. పుంగనూరు మండలం వనమలదిన్నెలో టీడీపీ బ్యానర్లు కాల్చి వేశారని 11 మందిపై తప్పుడు కేసులు నమోదు చేశారు. ఎంబీటీ రోడ్డులో రూ.80 లక్షలతో నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని అర్ధరాత్రి కూల్చివేశారు. మాజీ ఎంపీపీ నరసింహులు, మల్లుపల్లికి చెందిన గోపినాథ్, పీకేఎం ఉడా మాజీ చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్‌పై దాడి చేసి, ఇల్లును ధ్వంసం చేశారు. మిర్జేపల్లెలో రాకపోకలు స్తంభింపజేశారు. అలాగే పాలెంపల్లి, భీమగానిపల్లి, చంద్రమాకులపల్లె సచివాలయాల శిలాఫలకాలను ధ్వంసం చేశారు. చౌడేపల్లె మండలం దాదేపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరుగురిని గాయపరిచారు. సోమల మండలం కమ్మపల్లెలో వైఎస్సార్‌సీపీకి చెందిన 10 కుటుంబాలను చిత్రహింసలకు గురి చేశారు. సుబ్రమణ్యం రెడ్డి కుటుంబాన్ని నానాహింసలు పెట్టి టమాటా పంటను, ఇటుక బట్టీని ధ్వంసం చేశారు. రొంపిచెర్ల మండలంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులను జేసీబీలతో కూల్చివేశారు.



టీడీపీ మూకల దాడిలో ధ్వంసమైన వాహనాలు

పూతలపట్టులో అరాచకాలు..

కాణిపాకం: పూతలపట్టు నియోజకవర్గంలో టీడీపీ అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. సామాన్య జనంపై దాడులు చేస్తున్నారు. కూటమి కట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. విచ్చలవిడిగా ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, డీలర్లు, పారిశుద్ధ్య కార్మికులను వేధిస్తున్నారు. పూతలపట్టులోని 5 మండలాల్లో వ్యాపారాలతో పాటు అధికంగా వ్యవసాయం, కూలి చేసుకుని జీవనం సాగించేవారు అధికం. అయితే పార్టీలకు అతీతంగా ఉండేవారిపై కూడా టీడీపీ నేతలు దాడులు చేశారు. టీడీపీ అధికారంలోకి రాకముందు.. శాంతిభద్రతలకు ఢోకా ఉండదని నమ్మి ఓటేసిన ప్రజలకు కూటమి నేతలు చుక్కలు చూపిస్తున్నారు.

దాడుల్లో మచ్చుకు కొన్ని..

- గత నెల 4వ తేదీన బంగారుపాళ్యం మండలం మొగిలివారిపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లపై టీడీపీ శ్రేణులు దాడులు చేయడంతో అరుణ్‌కుమార్, రాజు, హరీష్ తీవ్రంగా గాయపడ్డారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. టీడీపీ కార్యకర్తల దౌర్జన్యాలకు భయపడి మాజీ సర్పంచ్, మండల బీసీ నాయకుడు దొరస్వామి, కార్యకర్తలు నంద, మరికొందరు ఊరు వదిలి వెళ్లిపోయారు.
- తవణంపల్లి మండలం తెల్లగుండ్లపల్లికి చెందిన కృష్ణమూర్తి యాదవ్ ఇంటిపై 10 రోజుల కిందట టీడీపీ నేతలు దాడికి దిగారు. కృష్ణమూర్తికి చెందిన జేసీబీతోనే అతని ఇంటి ప్రహరీ గోడను కూల్చేశారు.
- పూతలపట్టు మండలం ఎగువపాలకూరుకు చెందిన జయపాల్, నిరంజన్, హరి, బాబుకు చెందిన ఇళ్లపై టీడీ పీ నాయకులు దాడి చేసి ధ్వంసం చేశారు. అదే గ్రామంలో మహానేత వైఎస్సార్ విగ్రహాన్ని పగులగొట్టారు.
- రంగంపేట క్రాస్‌లోని వైస్ సర్పంచ్ నందయ్య కిరాణా షాపును ధ్వంసం చేశారు. వావిల్‌తోటలోని కిరణ్, హరిబాబు, శ్రీకాంత్ రెడ్డి, ఉమాపతి నాయుడుపై దాడి చేసి వారి ఆస్తులకు నష్టం కలిగించారు.
- పాటూరులో ఎస్సీలకు కేటాయించిన ఇళ్లను జేసీబీలతో కూల్చేశారు.
- పి.కొత్తకోటలో నవీన్ రెడ్డి బైక్‌ను ధ్వంసం చేశారు.
- యాదమరి మండలం మాదిరెడ్డిపల్లికి చెందిన హరిబాబును పొలంలో చెట్టుకు కట్టేసి టీడీపీ కార్యకర్తలు విక్షచణా రహితంగా కొట్టారు. తీవ్రంగా గాయపడడంతో కుటుంబీకులు ఆస్పత్రిలో చేర్పించారు. వీటిలో కొన్నింటిపై కేసులు నమోదు అయ్యాయి.



తవణంపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటి ప్రహరీని కూల్చేసిన టీడీపీ నేతలు



టీడీపీ దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త

కుప్పంలో రౌడీరాజ్యం..

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో టీడీపీ రౌడీలు రాజ్యమేలుతున్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన నేతలు, కార్యకర్తలపై ఈ 40 రోజుల్లోనే 24 కేసులు పెట్టారు. వీటిలో అధికంగా 307 సెక్షన్ కింద అటెంప్ట్ మర్డర్ కేసులు పెట్టి రిమాండుకు తరలించారు. ప్రధానంగా గుడుపల్లె మండలం గుండ్లసాగరం వైస్ సర్పంచ్ అశోక్, ఎన్.కొత్తపల్లి వైఎస్సార్‌సీపీ నేత ఈశ్వర్ కుటుంబ సభ్యులపై కేసులు పెట్టారు. రామకుప్పం మండలం 89 పెద్దూరు సర్పంచ్ గోవిందప్ప కుటుంబ సభ్యులపై 307 సెక్షన్ కింద కేసు కట్టి రిమాండ్‌కు తరలించారు. శాంతిపురం మండలం నంజంపేట, నాయనపల్లికి చెందిని మూర్తి, రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కృష్ణమూర్తిపై కేసు నమోదు చేశారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీపురంలో వైఎస్సార్‌సీపీ నేత మహాలింగ ఇంటిపై దాడి చేసి రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం కలిగించారు. రామకుప్పంలో అరటితోటను నరికివేసి సంబంధిత రైతు వైఎస్సార్‌సీపీ అభిమాని ప్రకాష్‌కు భారీగా నష్టం కలిగించారు.



కుప్పం: వైఎస్సార్‌సీపీ నేతకు చెందిన అరటి తోటను నరికేసిన టీడీపీ నేతలు

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో ఈ నెల 22వ తేదీన ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలని తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు కచ్చితంగా కార్యక్రమానికి హాజరుకావాలని చెప్పారు. ఎవరైనా గైర్హాజరైతే శాఖాపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

వైభవం.. అగ్నిగుండ ప్రవేశం



కార్వేటినగరం: అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో ద్రౌపదీదేవి అమ్మవారు

కార్వేటినగరం: మండలకేంద్రంలో వెలసిన శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం అగ్నిగుండం ప్రవేశంతో వైభవంగా ముగిశాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా మహిళలు అమ్మవారికి పొంగళ్లు వండి నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం కంకణాలు ధరించిన భక్తులు కుమారగిరి సమీపంలో ఉన్న స్కంధపుష్కరిణిలో స్నానమాచరించి పసుపు వస్త్రాలు ధరించి అమ్మవారితో పాటు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అగ్నిగుండం వద్దకు ఊరేగింపుగా చేరుకున్నారు. అర్చకులు అగ్గితో అమ్మవారికి వడిబాల కట్టారు. అనంతరం అమ్మవారి విగ్రహం అగ్నిగుండంలోకి ప్రవేశించగా భక్తులు కూడా దిగారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామస్తులు, తమినాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఈ కార్యక్రమానికి బలిజ కులస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పోకల సోమనాథ్, ప్రధాన కార్యదర్శి హరిబాబు, ఉపాధ్యక్షుడు శివప్రకాష్, కోశాధికారి బాబురెడ్డి, ఉప కోశాధికారి కృష్ణయాదవ్, భక్తులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ సత్యబాబు, ఎస్ఐ వెంకటకృష్ణ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



తరలి వచ్చిన భక్తజనం

క్లుప్తంగా

ఏపీని మరో బిహార్ చేసేశారు

తిరుపతి సిటీ: ప్రశాంత ఆంధ్రప్రదేశ్‌ను కూటమి ప్రభుత్వం మరో బిహార్‌గా మార్చేసిందని ఎస్వీయూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మన్నెం ప్రేమ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీ ప్రధాన ద్వారం వద్ద గల అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆదివారం విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో 'ఛలో ఢిల్లీ... సేవ్ ఏపీ' అంటూ నినదిస్తూ ప్లకార్డులను ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఏపీలో నూతనంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వ పాలన అస్తవ్యస్తంగా ఉందన్నారు. హత్యలు, అరాచకాలు, మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు, అత్యాచారాలు, కక్ష సాధింపులే అజెండాగా చంద్రబాబు పాలన సాగుతోందన్నారు. తాలిబన్ల పాలనకు మించి కూటమి నేతల దౌర్జన్యాలు రాజ్యమేలుతున్నాయని మండిపడ్డారు. ప్రత్యర్థులను నడిరోడ్డుపై విచక్షణా రహితంగా వేట కొడవళ్లతో నరుకుతుంటే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ చోద్యం చూస్తూ హేళనగా మాట్లాడడం దారుణమన్నారు. బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సైతం విమర్శించడం తగదన్నారు. అధికారం శాశ్వతం కాదనే వాస్తవాన్ని కూటమి నేతలు గ్రహించాలని హితవు పలికారు. రాష్ట్రం గత 40 రోజులుగా వల్లకాడుగా మారిందని, వెంటనే కేంద్రం జోక్యం చేసుకుని రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 24వ తేదీన ఢిల్లీలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నాకు వర్సిటీ నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు పసుపులేటి సురేష్, ఉప సర్పంచ్ మల్లెమొగ్గల ఉమాపతి, ముని, నరేష్, దినేష్, మధు, పవన్, చరణ్, సోము, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

స్నాతకోత్సవం.. పట్టాభిషేకం

- అట్టహాసంగా తిరుపతి ఐఐటీ 6వ స్నాతకోత్సవం
- ఐఐటీలో ఇంజినీరింగ్ విద్యను పూర్తి చేయడం గొప్ప అచీవ్‌మెంట్
- మన ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటండి
- ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ


ఏర్పేడు ఐఐటీలో ఇంజినీరింగ్ పట్టాలు అందుకున్న విద్యార్థులు

ఏర్పేడు/రేణిగుంట: 'వారంతా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతిభావంతులు. ప్రఖ్యాత జాతీయ విద్యాసంస్థ 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) తిరుపతి ప్రాంగణంలో దిగ్విజయంగా కోర్సును పూర్తి చేశారు.. ఏళ్ల తరబడి తాము పుస్తకాలతో కట్టిన దోస్తీ... మెదడులో కదలాడిన విభిన్న ఆలోచనలతో ఎన్నో నూతన ఆవిష్కరణలకు నాంది పలికారు.. కష్టానికి తగిన ప్రతిఫలం అందుకునేందుకు తెల్లకోటు ధరించి.. తిరుపతి ఐఐటీ లోగోతో కూడిన వస్త్రాన్ని కప్పుకుని తల్లిదండ్రులు, బంధుమిత్రుల కరతాళ ధ్వనుల మధ్య ఆచార్యుల చేతులమీదుగా అందుకున్న 'పట్టా' వారందరినీ ఆనందడోలికల్లో ముంచెత్తింది. పట్టాను అందుకుని సంబరాల్లో మునిగితేలారు. ఆదివారం సాయంత్రం జరిగిన తిరుపతి ఐఐటీ 6వ స్నాతకోత్సవ వేడుక వారి జీవితాల్లో ఓ మరపురాని ఘట్టంగా మిగలనుంది.'

ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో ఆదివారం సాయంత్రం ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ అధ్యక్షతన 6వ స్నాతకోత్సవ వేడుక ఘనంగా జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా ఆక్సిలర్ వెంచర్స్ చైర్మన్, ఇన్ఫోసిస్ కో–ఫౌండర్ క్రిస్ గోపాలకృష్ణన్, జేఎస్‌డబ్ల్యూ చైర్మన్ సజ్జన్ జిందాల్ గవర్నింగ్ బాడీ చైర్మన్‌గా వేడుకలో పాల్గొన్నారు. ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఏర్పేడు సమీపంలోని శాశ్వత ప్రాంగణంలో నడుపుతున్న ఐఐటీలోని వసతులతోపాటు కోర్సుల్లో ఉన్న విద్యార్థులు, సాధించిన విజయాలు, అధిగమించిన సవాళ్లను వివరించారు. స్నాతకోత్సవంలో విద్యార్థులతో కలసి పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కోర్సు పూర్తి చేసుకుని బయటకు వెళ్లేవారందరూ శాస్త్ర, సాంకేతిక రంగానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించి అవకాశాలను అందిపుచ్చుకుని భారతదేశ ఖ్యాతిని ప్రపంచదేశాలకు చాటి చెప్పాలన్నారు. ఉత్తమ పౌరసత్వ లక్షణాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథి క్రిస్ గోపాలకృష్ణన్ మాట్లాడుతూ గొప్ప ఇంజినీర్లుగా రాణించి నూతన ఆవిష్కరణలతో దేశాన్ని శాస్త్ర, సాంకేతిక రంగంలో ముందువరుసలో నిలపాలన్నారు. ప్రణాళికతో కూడిన కఠోర శ్రమతోనే పోటీ ప్రపంచంలో రాణించగలుగుతారన్నారు. ప్రతి విద్యార్థి ఒక బ్రాండ్‌గా ఎదగాలని ఆయన కాంక్షించారు.

పతకాల ప్రదానం

తిరుపతి ఐఐటీలో అత్యధిక మార్కులు సాధించడంతోపాటు సర్వతోముఖ ప్రజ్ఞను ప్రదర్శించిన విద్యార్థులకు వివిధ అవార్డులు, మెడళ్లను ప్రదానం చేశారు. బీటెక్ విద్యార్థి అనుష్‌మంగళ్‌కు బెస్ట్ అకడమిక్ పెర్ఫామెన్స్ ఇన్ ద బీటెక్ ప్రోగ్రాం కింద స్నాతకోత్సవ సభలో ప్రెసిడెంట్ మెడల్, బంగారు పతకం, ప్రశంసాపత్రాన్ని అందించి సత్కరించారు. ఆల్‌రౌండ్ ప్రొఫెషియెన్సీ ఇన్‌కరికులర్, ఎక్స్‌ట్రా కరికులర్ యాక్టివిటీస్ ఇన్ బీటెక్ ప్రోగ్రాంలో అత్యుత్తమ ప్రతిభను కనబరచిన బీటెక్ విద్యార్థిని స్నేహ ఎంఎస్‌కు గవర్నర్ పతకాలను అందజేశారు. అలాగే ఆర్వీ అసోసియేట్ ప్రైజ్‌ను బీటెక్ విద్యార్థి ఆర్.విశ్వనాథ్‌కు, ఇన్‌స్టిట్యూట్ ప్రైజ్‌లను ఎంటెక్ విద్యార్థిని ఇందుకూరి నాగమహిత, బీటెక్ విద్యార్థి అనుష్ మంగళ్, ఎంటెక్ విద్యార్థిని జనపాటి వినీలాదేవి, శ్రీరాం, అభిషేక్‌గుప్తా, శ్రీగణేష శర్మ, అమరరాజ ప్రైజ్‌ను డేవిడ్‌సన్ పాల్, ఐటీసీ లిమిటెడ్ ప్రైజ్‌ను స్నేహ ఎంఎస్, శ్రీనివాసన్ నటరాజన్ అవార్డును దెబాశిష్ రోల్, ఆకురతి కుమారస్వామి, సీతారావమ్మ మెమోరియల్ ప్రైజ్‌ను ఆర్య ఏ పిళ్లైకు ప్రదానం చేశారు.




గవర్నర్ అవార్డును అందుకుంటున్న స్నేహ, తల్లిదండ్రులతో ఇంజినీరింగ్ డిగ్రీ పట్టా అందుకున్న నమితారెడ్డి

338 మందికి పట్టాలతో సత్కారం

స్నాతకోత్సవంలో ఐఐటీలో చదివిన మొత్తం 338 మంది విద్యార్థులకు ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ చేతుల మీదుగా పట్టాలను అందించి ఘనంగా సత్కరించారు. అందులో మొత్తం 210 మంది విద్యార్థులకు బీటెక్ డిగ్రీ పట్టాలు, 75మందికి ఎంటెక్ డిగ్రీ పట్టాలు, 28 మందికి ఎంఎస్సీ డిగ్రీ పట్టాలు, 16 మందికి ఎంపీపీ డిగ్రీ పట్టాలు, ముగ్గురికి ఎంఎస్(రీసెర్చ్) డిగ్రీ పట్టాలు, ఐదుగురికి పీహెచ్‌డీ డిగ్రీ పట్టాలు, ఒకరికి డిప్లొమా పట్టాను ప్రదానం చేశారు. విద్యార్థులు పట్టాలు అందుకుంటుండగా సభికులు కరతాళ ధ్వనులతో వారిని అభినందించారు.

ఐఏఎస్ సాధించడమే లక్ష్యం



మాది ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా. నా తండ్రి ఆయుష్ మంగళ్ ఆగ్రా యూనివర్సిటీలో స్టాటిస్టిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. నా తల్లి పేరు శ్వేత అగర్వాల్. నేను తిరుపతి ఐఐటీలో సీటు సాధించి బీటెక్ కోర్సును పూర్తి చేశాను. బీటెక్‌లో సాధించిన అత్యుత్తమ మార్కుల ఆధారంగా నన్ను ప్రెసిడెంట్ మెడల్‌తో సత్కరించడం చాలా సంతోషకరం. ప్రస్తుతం గార్గాన్‌లో జాబ్ చేస్తున్నాను. అయితే ఐఏఎస్ సాధించడమే నా లక్ష్యం.

– అనుష్ మంగళ్, తిరుపతి ఐఐటీ ప్రెసిడెంట్ మెడల్ విజేత

స్టార్టప్‌గా ఎదగడమే లక్ష్యం



మాది బెంగళూరు. మా తల్లిదండ్రులు శ్రీనివాస్, శృతి నన్ను బాగా ప్రోత్సహించారు. తిరుపతి ఐఐటీలో మెకానికల్ ఇంజనీరింగ్‌లో చేరాను. ఇక్కడ ప్రొఫెసర్లు ఎంతో విలువైన సమాచారాన్ని, బోధనను అందించి మా ఉన్నతికి తోడ్పడ్డారు. స్నాతకోత్సవ వేడుకలో డిగ్రీ పట్టా తీసుకోవడమే స్వప్నంగా భావించిన నన్ను ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ గవర్నర్ మెడల్‌తో సత్కరించడం గొప్ప అనుభూతి. మ్యానుఫాక్చరర్ స్టార్టప్‌గా అవతరించి భారతావని మెచ్చేటి గొప్ప ఉత్పత్తులను ప్రజలకు అందించడమే లక్ష్యం.

– స్నేహ ఎంఎస్, గవర్నర్ మెడల్ విజేత, తిరుపతి ఐఐటీ.

పుష్పయాగానికి అంకురార్పణ


అప్పలాయగుంట ఆలయంలో సేనాధిపతి ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం పుష్పయాగం కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. ఉదయం 5.45 గంటలకు సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రసన్న వేంకటేశ్వరస్వామిని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి విశ్వరూప దర్శనానికి భక్తులను అనుమతించారు. అనంతరం తోమాల సేవ, కొలువు, అర్చన చేపట్టారు. సాయంత్రం 6 గంటలకు మాడవీధుల్లో మేళ తాళాల మధ్య సేనాధిపతి ఊరేగింపు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం పుట్టమట్టిని ఆలయం నుంచి ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు పుట్టమట్టిని మేదినిదేవి రూపంలో అలంకరించారు. దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. రాత్రి 8 గంటలకు ఆలయ మహాగోపురం వద్ద వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ అంకురార్పణ నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పుష్పయాగం..

సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి 12 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పుష్పయాగం కనుల పండువగా నిర్వహిస్తారు. కార్యక్రమంలో వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అభిషేకిస్తారు. అనంతరం తిరువీధి ఉత్సవాన్ని నిర్వహిస్తారు.

కుష్టు నియంత్రణే లక్ష్యంగా..

- ఈ నెల 18న ప్రారంభమైన ఎల్సీడీసీ సర్వే
- ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది
- ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి వైద్యం అందించేలా చర్యలు
- వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా చికిత్స


తవణం పల్లె మండలంలోని జోగివారిపల్లెలో కుష్టువ్యాధి సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

కాణిపాకం: కుష్టు వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా అధికారులు సర్వే ప్రారంభించారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్సీడీసీ) పేరుతో 14 రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమం నేషనల్ లెప్రసీ ఎరాడికేషన్ ప్రోగ్రాం (ఎన్ఎస్ఈపీ) ఆధ్వర్యంలో ఆగస్టు 2వ తేదీ వరకు కొనసాగుతుంది. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సమగ్రంగా సర్వే నిర్వహిస్తున్నారు. పూతలపట్టు నియోజకవర్గ వ్యాప్తంగా 75 వేల కుటుంబాలు ఉన్నాయి. ఇంటింటికీ వెళ్లి ఉన్న జనాభా మేరకు సర్వే ప్రక్రియ కొనసాగుతుంది. నియోజకవర్గంలోని పూతలపట్టు, ఐరాల, తవణంపల్లి, బంగారుపాళ్యం, యాదమరి పీహెచ్‌సీ పరిధిలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలను 250 టీమ్‌లుగా ఏర్పాటు చేశారు. ఒక్కో టీములో ఒక ఏఎన్ఎం, ఆశా కార్యకర్త, వైద్య సిబ్బంది మొత్తం ముగ్గురు ఉంటారు. వీరు వారి పరిధిలోని ఇళ్లకు వెళ్లి మచ్చలను పరిశీలిస్తారు. కొత్త కేసులను గుర్తించి వారికి పూర్తిస్థాయిలో వైద్యం అందిస్తారు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి వైద్యం అందిస్తే అంగవైకల్యం రాకుండా నిరోధించవచ్చని వైద్యులు చెబుతున్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 45 మంది కుష్టు వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు వైద్యాధికారులు వెల్లడించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశానుసారం 10 వేల జనాభాకు ఒక్కరు మాత్రమే కుష్టు వ్యాధిగ్రస్తులు ఉండాలి. ప్రస్తుతం జరుగుతున్న సర్వే ద్వారా 32 మంది అనుమానిత లక్షణాలు ఉన్నవారిగా గుర్తించారు. వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

వ్యాధి లక్షణాలు..

- చర్మంపై స్పర్శ లేని మచ్చలు
- చెవులపై బుడిపెలు, కణుతులు, నరాల తిమ్మిర్లు
- మందమైన మెరిసే జిడ్డు గల చర్మం
- కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం
- కనురెప్పలు మూత పడకపోవడం. చేతులకు, కాళ్లకు బొబ్బలు రావడం, కాలి చెప్పులు జారిపోవడం
- చేతి, కాలి వేళ్ల వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం
- చల్లని, వేడి వస్తువులను గుర్తించకపోవడం, పాదాల్లో వాపు
- ముక్కు దిబ్బడ, ముక్కు నుంచి రక్తం కారడం

ఉచితంగా చికిత్స..

కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారికి రెండు పద్ధతుల ద్వారా వైద్యసేవలు అందిస్తారు. శరీరంపై మూడు మచ్చలు ఉన్నవారికి పాసివ్ బ్యాసిలరీ (పీబీ) విధానంలో ఆరు నెలలు, అలాగే ఐదుమచ్చలు పైబడి ఉన్నవారికి మల్టీ బ్యాసిలరీ (ఎంబీ) విధానంలో 12 నెలల పాటు చికిత్స అందిస్తారు. ఇందులో భాగంగా నెలకు ఒకసారి ఆయా రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సిబ్బంది మందులు అందజేస్తారు. సర్వేలో గుర్తించిన రోగులకు సకాలంలో వైద్యం అందించడంతో పాటు ఆ వ్యాధిపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తారు. వ్యాధిని సకాలంలో గుర్తిస్తే మెరుగైన వైద్యంతో నివారించవచ్చు. 1987 తర్వాత బహుళ ఔషధ చికిత్స (మల్టీ డ్రగ్ థెరపీ) ద్వారా వ్యాధిని అరికడుతున్నారు. వ్యాధికి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు ఉచితంగా అందిస్తున్నారు.

సకాలంలో చికిత్స తీసుకోవాలి..



లెప్రసీ వ్యాధిని సకాలంలో గుర్తించి వారికి తగిన వైద్యం అందించాలనే ఉద్దేశంతో వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు ఎల్సీడీసీ సర్వే చేపట్టాం. ప్రజలంతా సహకరించాలి. వైద్య సిబ్బంది కూడా ప్రతి ఒక్కరినీ సర్వే చేయాలి. ఎలాంటి లక్షణాలు ఉన్నా వెంటనే వైద్యాధికారులకు తెలియజేయాలి. వ్యాధిని తొందరగా గుర్తిస్తే సకాలంలో తగ్గించుకోవచ్చు.

– వెంకటప్రసాద్, జిల్లా క్షయ నివారణ అధికారి, చిత్తూరు

దీవించు తల్లీ.. గంగమ్మా..

- గంగమ్మకు బంగారు హారాన్ని విరాళంగా ఇచ్చిన దాతలు
- ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు


అధికారులకు బంగారు హారాన్ని అందజేస్తున్న బెంగుళూరుకు చెందిన దాత యశ్వంత్‌కుమార్

చౌడేపల్లి: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. కోరిన కోర్కెలు తీర్చే గంగమ్మతల్లి దీవెనల కోసం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి సుమారు 25 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అత్యంత సుందరంగా ముస్తాబు చేశారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, జంతుబలులు ఇచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయం వద్ద ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు క్రమబద్ధీకరించారు. ఆలయ ఉప కమిషనర్ ఏకాంబరం పర్యవేక్షించారు. భక్తులకు ఉచిత తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

గంగమ్మకు బంగారుహారం సమర్పణ..

బోయకొండ గంగమ్మ అమ్మవారికి కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన యశ్వంత్ కుమార్ రూ.4 లక్షలు విలువచేసే సుమారు 52 గ్రాముల బరువు గల బంగారు హారాన్ని ఆదివారం విరాళంగా అందజేశారు. దాతలు ఆలయ ఉప కమిషనర్ ఏకాంబరానికి హారం అందించగా అమ్మవారికి అలంకరించారు. తమ కోరిక ఫలించడంతో కుటుంబ సమేతంగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి, మొక్కు చెల్లించుకున్నట్లు దాత తెలిపారు. అనంతరం దాతకు ఆలయ అధికారులు అమ్మవారి పవిత్ర తీర్థాలను అందజేశారు.

4న సీపీఐ జనరల్ బాడీ సమావేశం


మాట్లాడుతున్న నాగరాజన్

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరులో ఆగస్టు 4న జరిగే సీపీఐ జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజన్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలో నిర్వహించిన పార్టీ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ విస్తరణ, ప్రజా సంఘాల బలోపేతానికి ప్రతి శాఖ కార్యదర్శులు కృషి చేయాలన్నారు. జిల్లా అన్నివిధాలా వెనుకబడి ఉందని, జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం పోరాటం కొనసాగించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆగస్టు 4న పార్టీ బలోపేతానికి కార్యాచరణను వెల్లడించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జగదీష్, హరినాథరెడ్డి, ఓబులేసు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

తిరుపతికి కండలేరు జలాలు విడుదల

రాపూరు: తిరుపతి నగర ప్రజల దాహార్తి తీర్చేందుకు కండలేరు జలాలను ఆదివారం నుంచి విడుదల చేస్తున్నట్లు తెలుగుగంగ ఎస్ఈ వెంకటరమణారెడ్డి తెలిపారు. కండలేరు జలాశయం పంపింగ్ స్పాట్ నుంచి హిటాచీతో మట్టికట్టను తొలగించి సాయంత్రం 4 గంటలకు నీటిని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ చెన్నై, తిరుపతి మున్సిపాలిటీకి కండలేరు జలాలను విడుదల చేయవలసి ఉందన్నారు. మే 15వ తేదీ జలాశయంలో నీటి మట్టం తగ్గడంతో నీటి విడుదల ఆపివేశామని చెప్పారు. ప్రస్తుతం తిరుపతి నగరంలో నీటి ఎద్దడి తలెత్తడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కండలేరు జలాశయం నుంచి నీటిని విడుదల చేయవలసి వచ్చిందన్నారు. కండలేరు జలాశయం నుంచి నీటిని పంపింగ్ ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని దానికి సుమారు రూ.17 కోట్లు వ్యయం అవుతుందని, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. అయితే ప్రస్తుతం అంత మొత్తం ప్రభుత్వం భరించలేదని ప్రత్యామ్నాయంగా కాలువలో పూడిక తీసి నీరు విడుదల చేయవచ్చని తెలిపిందని వివరించారు. ఈ కారణంగా కాలువ పూడిక తీసేందుకు తిరుపతి మున్సిపాలిటీ రూ.85 లక్షలు మంజూరు చేయడంతో వెంటనే నీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం 30 రోజుల పాటు, రోజుకు 250 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తామని తెలిపారు. ఈ నీరు శ్రీకాళహస్తి సమీపంలోని 88 కిలోమీటర్ వద్ద ఉన్న రామాపురానికి చేరుతుందని, అక్కడి నుంచి పంపింగ్ ద్వారా తిరుపతికి చేరవేయనున్నట్లు చెప్పారు. విడుదల చేస్తున్న జలాలను ఆయనతోపాటు ఈఈ విజయకుమార్‌రెడ్డి, తిరుపతి మున్సిపాలిటీ డీఈ రాజు, ఏఈలు, సిబ్బంది పరిశీలించారు.